# తీరని బాధ

[కథానిక]

## శ్రీ గోల్లమూడి లక్ష్మినారాయణ

"'రామయ్యపంతులంతటిఅదృష్టవంతుడు ప్రపంచంలో మరొకాడు ఉండడు. అంత అదృష్టానికి ఇంతవరకూ ఎవ్వరూ పెట్టిపుట్టలేదు' అని అనుకుంటారుకదూ మీరందరూ.

'ఆయన కేం, మహారాజు! తను తిని, పదిమందికి పెట్టగలిగినవాడు. పేరు ప్రఖ్యాతుల కేమీ కొదువలేదు.

'ఒకడికి కష్టం వస్తే, చూసి కరిగిపోతాడు. కష్టకాలంలో అయినవాడనీ, కానివాడనీ భేదం లేకుండా చేతనైన సాయం చేస్తాడు. ఆఖరికి, ఎంతటి బీద బ్రాహ్మడు చచ్చినా శవాన్ని మోస్తాడు' ఇలా అనుకుంటారు మీరంతా......"

పేరుప్రఖ్యాతులు బాగా ఆర్జించి, పెత్తనం మీదపడగా న్యాయవాదివృత్తిలోంచి విరమించుకున్న రామయ్యపంతులు, ఎదురుగావున్న గోడకు తగిలించిన పుష్పాలంకృతమైన ఒకయువకుడి చిత్రాన్ని రెప్పార్పకుండా చూస్తూ, వేదాంతుడిస్వరంలో అలా అనర్గళంగా చెప్పుకుపోతున్నాడు.

"నాకు దిగు లేమీ లేదనీ, సర్వం సలక్షణంగా వుందనీకూడా మీరు ఊహించుకుంటారు.

"అవును, మీరు అనుకుంటున్నది కొంతవరకు నిజమే. కాని మానవుడన్నాక దిగులంటూ ఉండక పోదు. నాకూ ఓ దిగులు వుందనీ, దానికి ఓ కారణం ఉందనీ ఎవ్వరూ కలలోనైనా అనుకోరు. ఆ దిగులేమిటో, ఆ విషయ మేమిటో నా కొక్కడికే తెలుసు. నే నొక్కడినే బాధపడుతుంటాను. ఎన్ని సంవత్సరాల నుంచో ఆ బాధ గడ్డకట్టుకుపోయింది. ఏవిధానైనా తీరటంలేదు. ఏ క్షణంలోనైనా, నా హృదయాన్ని పిండుతోంది. నా ఇప్పటి దయాదాక్షిణ్యాలకు మూలమంతా నా విచారానికి కారణమౌతున్న సంఘటనే.

"ఇదంతా ఎందుకు చెప్పతున్నానంటే నీవు యౌవనంలో ఉన్నావు. నా యీ బాధకి కారణమయిన సంఘటన యౌవనంలోనే జరిగింది. యౌవనంలో మూర్ఖాభిమానం, దురహంకారం ఎవడికైనా ఉంటాయి. అప్పుడు, ఎవడికి వాడే 'నేనే సరియైన దోవలో నడుస్తున్నాను. నాది అంతా న్యాయం' అనుకుంటాడు. అంచేతే నీకు చెప్పటం.

"అసలువిషయం చెప్తాను విను. చలపతి నాకు చిన్నవాటినుంచీ మిత్రుడు. మా మైత్రికి ఎక్కువగా దోహద మిచ్చింది—మేమిద్దరం ఒక క్లాసు చదవటం. చలపతి మాకు చాలా దూరపుబంధువు. ఆ బంధుత్వం విషయం బయటికి వచ్చింది స్నేహం ప్రారంభమైనాక. మా యిద్దరి మైత్రీ చాలామందిని ఆకర్షించింది. అసూయపడ్డవాళ్లుకూడా కొందరు లేకపోలేదు. ఎక్కడికెళ్లినా కవలల్లా మాజంట ఉండాల్సిందే.

"మాయిద్దరిభావాలూ సాహచర్యంతోపాటు అలా ఏకీభవించేవి. ఒకరు ద్వేషిస్తే మరొకాళ్లం తప్పకుండా అవ్యక్తిని ద్వేషించేవాళ్లం. ఒకరికి నచ్చితే తప్పకుండా

మరొకారికి అవస్తువే వచ్చేది. అలా మేమిద్దరం మనసా ఏకీభవించాం. అడవిలో స్వేచ్ఛగా ఒకదానికొకటి పెనవేసుకుని, అల్లుకుపోయే లతలు గుర్తుకువస్తాయి, మా స్నేహం గుర్తుకువస్తే.

"పదిహేను పదహారేళ్లవరకూ అలాగే ఉండేవాళ్లం. కాని, ఆతర్వాత మేమంతగా ఏవిషయంలోనైనా ఏకీభవించలేకపోయేవాళ్లం. అతను మారాడని నేననుకునేవాణ్ణి. నేను మారానని వాడనుకునేవాడు. ఎవ్వరూ మారలేదు. ఎవళ్లకి వాళ్లే అహంకారం పెంచుకున్నారు—'వాడు చెప్పిందే నేనెందుకు ఒప్పుకోవాలి?' అని.

"వాళ్లు మాఅంత భాగ్యవంతులు కారు. అంతమాత్రాన రెక్కాడకపోయినా, పస్తుండాల్సినఅవసరం లేదు.

"'దూ, దూ బసవన్న' పద్ధతిగాకుండా మాయిద్దరిమధ్యా ఏ విషయంమీదపట్టినా వాదనలు జరుగుతుండేవి. ఆవాదనల్లోనూ చలపతి బాగానే వాదించేవాడుగాని కాస్త తొందరపాటుమనిషి. వెంటనే మనిషి నిందకి దిగేవాడు. నే నేమీ అనుకోనని తెలిసే అనుకో. వాణ్ణి నిందించినా ఏమీ అనుకొనేవాడు కాడు. ఎంచేతంటే, ఎప్పుడూ అంటూండేవాడు—'కపటమంటూ నాదగ్గిర పనికిరాదు. మనసులో ఉన్నది బయటికి అనేయాల్సిందే' అని. కాని వాడుగూడా ఆ తర్వాత మారిపోయాడు.

"నేను నా శక్తికొద్దీ సాహిత్యసేవ చేశాను. నేను రచించిన గ్రంథాలన్నీ 'చలపతి' వ్రాసినట్లుగా చలామణిఅయినాయని నీకు తెలుసు. ఈ రచనాభ్యాసం అతనితో స్నేహముండగా ప్రారంభమైంది. వాడూ వికసిస్తూన్న మొగ్గ— చిత్రకారుడు, కవి.

"తిండీ, నిద్రా మరిచిపోయి వాదించుకునేవాళ్లం. అలాంటి వాదనల్లో ముఖ్యమైంది ఒకటిచెప్తాను.

'సాహిత్యమున్నాక, ఏదన్నా ప్రయోజనంతో ఒక విషయం, నీ పాఠకులకి తెప్పదలచుకుని రాయాలి చలపతీ!' అన్నాను—అతను కథ వకటి వినిపించాక.

'అంటే? నీ వనుకున్నది నాకు స్పష్టంగా అర్థం కాలేదు.' అన్నాడు చలపతి.

'ఏమీ లేదు. నీవు కథ ఒకటి వ్రాశావంటే పాఠకులకి ఒక నీతి బోధించటానికే నంటాను. లేకపోతే సాహిత్యంతో లోకానికేం పని?' అన్నాను నేను.

'అదిగో అక్కడే పప్పులో కాలేశావు. ఏది నీతి, ఏది న్యాయం నీ వెలా చెప్పగలవు? నీ కేమి తెలుసని? నీవు ఒకటి న్యాయ మంటావు. మరొకాడు అది అన్యాయమంటాడు. నీవు న్యాయ మని సమర్థిస్తూ కథ ఒకటి వ్రాస్తావు. అప్పుడు నీవేం చేస్తున్నావన్న మాట;—పాఠకుడి స్వాతంత్ర్యాన్ని నాశనంచేసి, ఒక గొర్రెలా నీ సిద్ధాంతాని కనుగుణంగా మార్చుకుంటున్నా వన్న మాట'—నొక్కి చెప్పాడు చలపతి.

'అయితే, నీదృష్టిలో, వాల్మీకి ప్రభృతులంతా అలా ప్రజలను గొర్రెలమందగా మార్చేవారనేనా?'—అడిగాను నేను.

'అక్కడే మీరంతా పొరబడేది. వాల్మీకికీన్నీ మీకున్నా పోలికేమిటి అసలు? నక్క వాతలు పెట్టుకొని 'నేనూ పులినే' అంటే అవుతుందా? వాల్మీకి సకల ధర్మాలూ తెలిసినవాడు. ఏది ధర్మమో, ఏది నీతో తెలిసినవాడు. వారంతా ద్రష్టలు. వారికి స్వార్థాలు లేవు. ఉద్రేకాలు లేవు. పండిపోయిన ముదుసలులు.

'అంతదాకా ఎందుకు! నీవు యౌవనంలో చేసిన రచన వార్థక్యంలో చదువుకుంటే, మరు క్షణాన్నే తగలబెట్తావు. మన మేం సర్వజ్ఞులం కాం. మన కేం తెలుసని, మన సిద్ధాంతాలు ఏం సరియైనవని ప్రపంచానికి చెప్పబోతాం. అక్కడే మీ గర్వం, మీ అహంకారం కనిపిస్తుంది. పంతులూ! నీవు చెడిపోతున్నావు. నీబుర్రలో పురుగు ప్రవేశించింది. నీవు పుట్టుకతోనే గర్విష్ఠివి. దాంతో ఆ పిచ్చిసిద్ధాంతాలన్నీ వంటపట్టున్నాయి. సాహిత్యం ఎప్పుడూ మాంచి లోకప్రయోజనాలకోసం పాటుపడ్తుందని, వర్గాభివృద్ధి కోసం కృషిచేస్తుం దని, ఏది పడితే అది నీతి అంటూ నెత్తిన రుద్దుతుం దనీ అనుకోబోకు. ఏది నీతి అని చెప్తాం? ఈ ప్రదేశంలో నీతి ఇంకో ప్రదేశంలో అ

నీతి. 'విశ్వశ్రేయః కావ్యం' అనే మూడు మాటలు సరిగ్గా అర్థంచేసుకో!' గుక్కతిప్పుకోకుండా ఉపన్యాస మిచ్చేవాడు చలపతి.

"కాని నాకుమాత్రం, అప్పట్లో చలపతి చెప్పిన వన్నీ గగనకుసుమాలుగా ఉండిపోయాయి. అతని ఆశయాలన్నీ గాలిమేడ లనిపించాయి. ఎంచేతో, నే నేకీభవించలేకపోయేవాణ్ణి. ఏవిషయంలోనైనా, మాకు భేదాలు వస్తే, అదంతా, ఇక నా ఖాగ్యానికి అంటగట్టేవాడు. నాకు మండిపోయేది.

"ఎలా అయితేనేం, ఇలాంటి చిన్న చిన్న విషయాల్లోనే మాలో విభేదాలు పొడసూపినాయి. చాలా చిన్నవి. పుట్టగొడుగుల్లాంటివి. మా స్నేహం మాత్రం తొణకలేదు. మనసులోమాత్రం కొన్ని కొన్ని విషయాల్లో నొచ్చుకున్నాను.

"బి. ఏ. మే మిద్దరం కలిసే చదివాం. చలపతి ఆషామాషగా చదివాడు. అంతగా శ్రద్ధపుచ్చుకోలేదు. రిజల్ట్సు వచ్చినపుడు చలపతి స్వగ్రామంలో వున్నాడు. నేను పాసయ్యాను. చలపతి 'గ్రూపు'లో తప్పాడు. పేపరు చూస్తుండగా చుట్టూ మాస్నేహితులు మూగి వున్నారు. ఎవ్వడూ నేలమీద నిలవటంలేదు. చలపతికి 'గ్రూపు'లో పోయిం దనగానే, అంతా ఆశ్చర్య పోయారు. 'అరె! వాడు, తప్పడ మేమిట్రా! మంచి తెలివిగలవాడుగదా? ఆఁ. ఏమిటే, ఈ చదువుకూడా పెద్ద...అని అంటూం డేవాడు' అన్నారు. 'తెలివితేటలు ఇక్కడేం పనికిరావురా! తెలివిలేని పిచ్చిరాతలన్నీ పరీక్షలప్పుడుగూడా చూసు కుంటూ, నా అంత తెలివిగలవా డెవ్వ డని విర్రవీగితే ఏ మవుతుందినే' అన్నాను. అన్నప్పుడు ఇలా అంటున్నానని తెలియకుండానే అనేశాను. ఆతర్వాత అన్న మాటలు మరచిపోయాను. ఆ పొంగులో ఆ ఉద్రేకపు మాటలు పొంగిపొర్లాయి.

"మద్రాసు వెళ్లి, 'లా' కాలేజిలో సీటు సంపాదించి ఇంటికి వచ్చాను. రాగానే, ఇంట్లోవాళ్లు, చలపతి వచ్చాడనీ, జ్వరం తగులుకున్నదనీ చెప్పారు."

"చూడటానికి వెళ్ళాను. మంచంమీద పడుకుని ఉన్నాడు. నేను రావటం చూసి అటువైపు తిరిగి పడుకున్నాడు. మంచంమీద కూచొని, వంటిమీద చేయి వేశాను. వళ్లు వేడిగా ఉంది. స్పృహలోనే వున్నాడు. 'ఎన్నాళ్లనుంచి? ఏం జ్వరం? ఇత్యాదు లన్నీ అడిగాను. కాని వాడు కదలలేదు; మెదలలేదు. నిశ్చలంగా నేలవంక చూస్తున్నాడు. తప్పా డని దిగులు ఏమైనా ఉందేమోనని 'పోతే పోయిందిలేరా. దిగులు పెట్టుకోబోకు.' అన్నాను. దానికీ మాట్లాడలేదు. 'ఏంరా, మాట్లాడవేంటి? ఎంచేత?'—అడిగాను. ఊహుఁ. పావుగంటసేపు కూచుని ఎంతకీ మాట్లాడక పోతే 'ఏమన్నా, తప్పు చేస్తే, క్షమించరా!' అని లేచి వచ్చేశాను. నాకళ్లు చెమ్మగిలినాయి.

"కొన్నాళ్లకి వాడికి జ్వరం తగ్గింది. మామూలుగా తిని తిరుగుతున్నాడు. నేను 'లా' చదువుదామని మద్రాసుకు రేపు బయలుదేరుతా ననంగా, చెప్పివద్దామని వాళ్ల యింటికి వెళ్ళాను. విచారంగా పాడుతున్న పాటొకటి వినిపిస్తోంది వాళ్ల యింట్లోనుంచి. అది చలపతి పాడుతున్నదే. ఆవిషయం నేను గట్టిగా చెప్పగలను. చలపతిని పిలవమని వాకిట్లో కూర్చున్న వాళ్ల చెల్లిని అడిగాను. లోపలకి వెళ్లివచ్చి 'లేడు' అని చెప్పింది! కాళ్లీడ్చుకుంటూ వెనక్కి తిరిగాను. కళ్ల వెంట నీళ్లు తిరిగాయి. చలపతి చెప్తూండేవాడు; విరోధం రాగూడదుగాని, వస్తే కలకాలముంటుం'దని. ఆమాటలు జ్ఞాపకం వచ్చి, నేను తపించిపోయేవాణ్ణి. ఎంతటి స్నేహితుడు ఎలా మారిపోయాడు! ఏమిటి నేను వాడికి చేసిన అపకారం? బుర్ర తిరిగిపోయేది. అంతా అయోమయంగా ఉండేది. నేను ఇప్పుడు మా స్నేహం చెడటానికి ఎవరు కారకులో చెప్పబోవటం లేదు. ఎవరిది తప్పోగూడా చూపించబోవటం లేదు. ఒకళ్లని ఒకళ్లం తప్పుగా అర్థంచేసుకుని ఉండాలి.

"నేను 'లా' చదివాను. ప్రాక్టీసుచేయటం మొదలుపెట్టాను. వాడు బి. యిడి. చదివి స్కూల్లో టీచరుగా చేస్తున్నాడు. ఇద్దరమూ ఒకే ఊళ్లో.

"అప్పుడప్పుడు తటస్థపడుతూండేవాళ్లం ఇద్దరం. ఎప్పుడన్నా 'ఏంరా?' అని కొద్దిగా పలక్క-

రిస్తాడేమో, పోయి కౌగిలించుకుందా మనిపించేది. నాకూ పల్కరించుదామనే అనిపించేది. నాలుకవరకూ వచ్చేది. కాని అతను నన్ను చూసీచూడనట్లు వెళ్తున్నప్పుడు పల్కరించటానికి వెనుకంజవేసేది నామనసు. ఇద్దరం తప్పుకుంటూ నడిచేవాళ్లం. ఎటుపడ్డప్పుడు చలపతీ, నా మాదిరిగానే, పల్కరించుదామని ప్రయత్నించి, పల్కరించలేకపోతున్నాడని అనుకునేవాణ్ణి. మాయిద్దరి మాటలూ పెగిలివచ్చే సుముహూర్తంకోసం కాచుకు కూర్చునేవాణ్ణి.

"లోపల ఎంత ప్రేమ దాచుకున్నా, ఎదుటి వాడి నిర్లక్ష్యం చూస్తే, ఎవరికైనా ఆ ఎదుటివాడి మీద నిర్లక్ష్యం పుట్టుకొస్తుంది. చలపతి అంతగా బిగిసివుంటున్నప్పుడు, నేను వాడి స్నేహంకోసం ఎంచేత అంతగా తాపత్రయపడాలి? అనే తర్కం నాలో బయలుదేరింది. నాలో చాలా మార్పు వచ్చింది.

"కొంతకాలం గడిచిపోయింది. దినకృత్యాలల్లో ఈస్నేహాలు, ఈవిరోధాలు అన్నీ అడుగున బడిపోయి నాయి.

"చలపతి నాకు వారానికి మూడునాల్గు సార్లన్నా కనిపించేవాడు. ఊళ్లో లేడేమో నను కున్నాను—పదిహేనురోజులనుంచీ కనిపించకపోతే. ఇద్దరు ముగ్గురు పాతస్నేహితుల్ని విచారిస్తే వాడికి 'టైఫాయిడ్' అని తెలిసింది! ఆ వార్త వినంగానే, మా సంబంధబాంధవ్యాలన్నీ తిరగపోసినట్లయింది. మనసు కెలికింది. వెళ్లి చూసొస్తే?............ వెనక వాడికి జ్వరమొచ్చినపుడు వెళ్లటం; వాడు తృణీకరించటం—నామనసుకు కష్టం కలిగించింది. వెళ్ల బుద్ధి కాలేదు. నాకుభయమూ వేసింది—ఈసారి పురుగును చూసినట్లు ఎంతగా చూస్తాడోనని...పూర్వం జ్వరంలో వచ్చిన మార్పు ఈసారి జ్వరంలో పోతే బాగుండు ననుకున్నాను. ఆమార్పు మాయమవుతుం దనీ, చలపతి నావాడు అవుతాడనీ, జ్వరం తగ్గాక నన్ను పల్కరిస్తాడనీ దృఢంగా విశ్వసించాను. మళ్లా మే మిద్దరం జీవితాలల్లో, ఎలా సహకారంగా తెల్లు చేసేదీ ఆనందంగా ఊహించుకున్నాను. ఈ పాలుసరోజుల్లో మనం బయటపడట మెందుకు? వాడు ఎలాగూ పల్కరిస్తాడు. మనం ముందరగా పల్కరించి, వాడి దృష్టిలో అలుసుకావట మెందుకు? మాట్లాడటం వాడు మొదట మానేశాడు కాబట్టి, పలకరించినా వాడే ముందరగా పలకరిస్తాడు. స్నేహితులంతా పోయి చూసి వస్తున్నారు. నాకూ చెప్పారు, చూసిరమ్మని. నేను 'ఆఁ' అంటూండేవాణ్ణి.

"ఇరవై రెండోరోజు.......ఒక్కరోజు ఆగితే... మళ్లా నా చలపతి...

"ఆరోజు సాయంకాలం కోర్టునుంచి వచ్చి, విశ్రాంతి తీసుకుంటున్నాను. ఏవేవో ఆలోచనలు... అకస్మాత్తుగా 'రామన్నయ్యా!' అని కేక వినిపించింది. లలిత వచ్చి, నావళ్లోకి వాలింది. 'రామన్నయ్యా, అన్నయ్య నిన్నొక్కసారి వచ్చి, వెళ్లమన్నాడు.' అన్నది నా మొహంలోకి చూస్తూ.

'నన్నా! చలపతి రమ్మన్నాడా!.........
ఎల్లాగుంది అన్నయ్యకు? డాక్టర్లు తగ్గిం దంటున్నారు కదూ?'

'అలాగే వుంది! డాక్టర్లు ఏమీ చెప్పరు. మా కందరికీ దిగులుగా ఉంది'—విచారంగా అన్నది.

'దిగు లెందుకు? తప్పకుండా తగ్గుతుంది చలపతికి. ఎల్లుండికల్లా నిన్నెత్తుకోడూ?' అని ముద్దు పెట్టుకొని 'నీ వెళ్లు. నేను సీలుచూసుకుని వస్తా నని చెప్పు!' అని బెట్టుసరిగా చెప్పి పంపాను.

"అలా బెట్టుసరిగా పైకి అన్నానేకాని, నా మనసు పరిపరివిధాల ప్రవహించింది. లలిత మాటలు చూస్తే, చలపతిరోగం ఏమీ సుముఖంగా లేదు...... నా హృదయం స్పందించింది. వాడు నోరారా పిలిచాడు. ప్రాణస్నేహితుడు...మనసులు అలా అతుక్కు పోయాయి. ప్రపంచంలో అంతకన్నా దగ్గిరవాడు లేడు......వాడి స్నేహం పోయినందుకు ఎలా విలపించాను! మళ్ళా వాడితో మాట్లాడి, హృదయంలో వున్న క్షోభంతా తో జేసుకుని ఏడుద్దా మని ఎంతగా తాపత్రయ పడ్డాను!

"ఏమిటో...అలా ఆలోచనలు సాగిపోయినాయి. తీరా చూసుకుంటూ రోడ్డుమీద నడుస్తున్నాను......అప్రయత్నంగా! చూపు కొనింది చలపతిఇల్లు. అటూయిటూ చూసి గబగబా అడుగులు వేసుకుంటూ నడిచాను. ఇంకో పదిగజాలు చలపతి ఇంటి వీథివాకిలికి... నేను తేలిపోయాను. చలపతి ఎలా ప్రవర్తిస్తాడా అని నా మనసు ఆటుపోటుల్లో ఉంది. గుమ్మం దృష్టిలో నుంచుకొని గాలిలో ఈదాను. మా మిత్రుడు గోపాలం కనిపించాడు. ఎవళ్ళకైతే నాకూ చలపతికీ మాటలు లేవని తెలుసో, వాళ్ళ కళ్ళ ఎదుట నాఅంత నేను మెట్టుమొదటగా చలపతిని చూడటానికా?......అవమానం!

"ముఖం తిప్పాను. ఏదో పనిఉన్నవాడిలా చరచరా, చలపతియింటివంక చూడకుండా నడుద్దామనుకున్నాను. కాళ్ళు పట్టుకుపోయినాయి. ఆలస్యమైంది నడక.

'అరేయ్, పంతులూ!' అంటూ భుజంమీద చేయి వేయనేవేశాడు గోపాలం. భుజాలు ముడుచుకున్నాను. 'చలపతికి చాలా సీరియస్‌గా వుందిరా! నే నిప్పుడే చూసివస్తున్నాను. అయినా, చూసివద్దాం రారా, ఇద్దరం' అని నన్ను వెనక్కి తిప్పాడు. 'ఇప్పుడు కాదురా — మాఅమ్మ తలనొప్పితో చాలా బాధపడుతోంది. 'ఆస్ప్రో' కొనుక్కురావాలి. వీలైనప్పుడు వస్తాలే. అయినా, మధ్య నీబలవంతం ఏమిటిలే!' అని విదిలించుకొని వచ్చేశాను. గోపాలం బొమ్మలా నిలబడ్డాడు.

"ఇక ఆరోజు సాయంకాలం వెళ్ళలేదు. రాత్రీ వెళ్ళలేదు. మర్నాడు ప్రొద్దున్నే వెళదామనుకున్నాను. ఏవేవో వ్య థ వ ఆ లో చ న లు నా మనసును మథించాయి. అన్నం తినలేదు. నిద్రపోదామని ప్రయత్నించాను. నిద్ర పట్టలేదు. కాని అనుకోకుండానే మైకం కమ్మింది—నిద్ర కాదు!

"ఏవేవో పీడకలలు—జంతువుల పీకలు తెగకోస్తున్నారు...ఎవరో? అంతా భయంకరంగా వుంది. పెళ్ళికూడా—ఎవరిదో జరిగిపోతోంది. వికటాట్టహాసాలు......అన్నీ......కుక్కల ఏడుపులు......మనుష్యరోదనమూ స్వల్పంగా బాహ్యస్మృతికి అందుతోంది.

"శరీరమంతా కంపనం కలిగించే ఆ పీడకలలే నన్ను ఒక్కసారిగా లేచి కూచోపెట్టాయి. ఇంట్లో గోలగా వుంది. మాఅమ్మ, నాన్న ఎక్కడికో ప్రయాణ మవుతున్నారు.

"'ఎంత లేపినా, లేవ వేంరా?' చలపతి చనిపోయాట్ట!' చైతన్యం శూన్యం ... ఏమి విన్నానో అర్థం కాలేదు. అలాగే నోరు తెరిచి చూస్తున్నాను. పావుగంట అయింది, ప్రాణంపోయి. వెర్రాం రాముడూ లే!' అన్నది మాఅమ్మ. బ్రహ్మ ఎంతటికఠినశిలలోంచి తొలిచి, నన్ను తయారుచేశాడో — అలా ప్రతిమలా కూర్చున్నాను. కాని ఎక్కడో భయంకరలోకంలో విహరిస్తోంది నామనసు. 'ఏమిటీఇదంతా, నే కంటున్న పీడకలల్లో ఇది ఒకటా?' అనుకున్నాను. 'రావూ?' అడిగింది అమ్మ. 'వద్దు, వద్దు. చలపతికి చావా! వద్దు' అని పీడకలల్లో అనుకుంటున్నట్లుగా, చేయి కళ్ళకు అడ్డంపెట్టుకొని తల అడ్డంగా ఊపేను. మాఅమ్మ, నాన్న బయలుదేరారు. మా పెంపుడుకుక్క నావంక ఒకసారి చూసి 'కుఁయ్ కుఁయ్' అంటూ తోక ఆడిస్తూ నాపాదం నాకింది. అదీ కదిలింది ...... చలపతిని చూడటానికి! కుక్క వెళ్ళింది.... చలపతి కళేబరాన్ని చూడటానికి......!

"కాకుల గోల. తెల్లవారింది— చైతన్యం వచ్చింది. రాత్రి జరిగిందంతా బాగా అర్థమయింది. చలపతిఇంటికి చొక్కా లేకుండానే పరుగుతీశాను.

"పాడెమీద పడుకోబెట్టారు చలపతిని. చలపతి దగ్గిరికి వచ్చాను. వణికిపోతున్నది శరీరం ... పిచ్చి చూపులు చూశాను. ఎవరో నన్ను దూరంగా తీసుకెళ్ళి కూచోపెట్టారు......

"పాడె లేచింది. లేచి, ఒకాయన్ని తోసి, కాళ్ళవైపు పట్టుకున్నాను. హృదయంలో కన్నీటి కుండలు బద్దలయినాయి. నిరంతరం, దోవపొడుగునా కన్నీళ్ళు కారినాయి. ఇదంతా ఊహించి చెపుతున్నాను,

అప్పుడు నే నేమి చేస్తున్నానో, ఇతరు లేంచేస్తున్నారో నాకు తెలియలేదు. బతికున్నప్పుడు నీలిగి, చలపతితో మాట్లాడలేదు. చలపతి చనిపోయాక శవం మోయటానికి హాజరయ్యాను. ఇదే న న్నెక్కువగా బాధపెట్టేది.

సూర్యాస్తమయంవరకూ, నేను శ్మశానంలో ఆ కాలిపోతున్న శవంవంక, మంటవంక, పొగవంక, బూడిదవంకా చూస్తూ ఉండిపోయాను. ఎంతమందో ఏమిటేమిటో, నాచెవిలో అన్నారు. నా కర్థం కాలేదు. నే నక్కడినుంచి కదలలేదు.

“కాలరథం శరవేగంతో పోతోంది. నాజీవితం బూజుపట్టుతోంది. కాని, చలపతీ — నేనూ; మామైత్రీ నాకర్కోటకత్వమూ, నా అహంకారం... అన్నీ కళ్లకు కట్టినట్లు స్పష్టంగా స్మృతిపథంలో నిత్యమూ సంచరిస్తుంటాయి.

“నిత్యమూ చలపతి వచ్చి, నాతో ఎంతో ఆప్యాయంగా మాట్లాడుతుంటాడు. అప్పుడప్పుడు ఇలా అంటాడు: ‘పంతులూ! నీవంత రాతిగుండెవాడ వని నె నెన్నడూ అనుకోలేదు. నీకూ, నాకూ మధ్య మాట్లాడక పోయినంతమాత్రాన ఏమంత విభేదాలు ఉన్నట్లు నామీద అంతగా కాఠిన్యం వహించావు? కాని, నిజానికి, నీ హృదయం నాకు తెలుసు. నిన్నేమీ నే ననను. కాని నన్ను మాత్రం నీజీవితంలో చెరిపేయబోకు!’

“పదిమందిమధ్యలో సాధారణంగా కళ్ల నీళ్లు రావు. హృదయం ద్రవించిపోతుంది. అప్పుడప్పుడు, లోకదృష్టిలో అర్థం లేకుండా, నాకళ్లవెంట నీళ్లు రావటం జడ్జికళ్లల్లోనూ, మిత్రుల కళ్లల్లోనూ, భార్యాబిడ్డల కళ్లల్లోనూ పడేది.

“ఇదో తీరని బాధ, అవ్యక్తమైన వ్యథ, కనబడని గాయం — అశాంతికి కారణం...

“చలపతిఫోటోమీద పడి, కన్నీరు మున్నీరుగా ఏడుస్తే, కడవలక్కడవలు కన్నీరుకారిస్తే, తాత్కాలికంగా ఉపశాంతి కలుగుతుంది.

“నాకూ, చలపతికీ భేదం లేదు. నాప్రతిబింబమే అతను. నేను కన్నీళ్లు కారుస్తున్నానని అతను కన్నీళ్లు కారుస్తున్నాడు — చూశావా, ఆ కన్నీటిచారలు!”

